
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 16 ఏప్రిల్ 2025

నేటి నుంచి శుభ ముహూర్తాలు

- వివాహాలు, శుభకార్యాలకు అనుకూలం
- 30న రికార్డు స్థాయిలో జరుగనున్న పెళ్లిళ్లు

6



పైలెట్ ప్రాజెక్టుగా మద్దూరు

- భూ భారతి అమలు కోసం రాష్ట్రంలో ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో ఒకటి
- ఇక్కడ తీరుతెన్నులు పరిశీలించిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- రేపటి నుంచి నెలాఖరు వరకు గ్రామ సభల నిర్వహణ
- జూన్ 2 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి..


వ్యవసాయ భూమి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన ధరణిలో అనేక లొసుగులు ఉండటం.. రైతులు, పట్టదారులు ఇబ్బందులు పడటం, రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాకపోవడం, స్థానికంగా సమస్యను పరిష్కరించే వేదికలు లేకపోవడంతో చాలా విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ధరణిని రద్దు చేస్తామని ప్రకటించింది. భూమాత పోర్టల్‌ను తెస్తామని చెప్పింది. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో భూభారతిని సిద్ధం చేయగా, గత అసెంబ్లీ సమావేశాల్లో ఆ చట్టానికి ఆమోదం తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి భూభారతిని ప్రారంభించి, విధివిధానాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోటుపాట్లను అధ్యయనం చేయడం కోసం ముందుగా రాష్ట్రవ్యాప్తంగా కాకుండా కేవలం నాలుగు జిల్లాల్లోని ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో ఈ పోర్టల్‌ను ప్రారంభించి, లోటుపాట్లను సరిదిద్దిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించారు. ములుగు జిల్లాలోని వెంకటాపురం, కామారెడ్డి జిల్లా లింగంపేట, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, నారాయణపేట జిల్లా మద్దూరు మండలాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోని మండలం కావడంతో మద్దూరును పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇక్కడ తీరుతెన్నులను పరిశీలించిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

గతంలో ఇలా..

గత ప్రభుత్వం 2016లో భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించింది. రికార్డులన్నింటినీ కంప్యూటరీకరించడంతోపాటు.. ధరణి పోర్టల్‌ను ప్రారంభించింది. ఎల్‌ఆర్‌యూపీ సమయంలో సర్వే నెంబర్ల తప్పులు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, ఒకరి భూమి ఒకరికి వెళ్లడం, వివాదాలు లేని భూములను కూడా పార్ట్-బీలో చేర్చడం వంటి చాలా తప్పులు జరిగాయి. వేల సంఖ్యలో రైతులు తప్పొప్పులు సరిదిద్దుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాగా, మెజారిటీ పూర్తి కాలేదు. అలాగే అప్పటి వరకు ఉన్న ఆర్డీవో, జేసీ కోర్టుల్లో ఉన్న కేసులను ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి.. డిస్పోజ్ చేశారు. దీనివల్ల కూడా సరైన న్యాయం జరగలేదు. మళ్లీ అడగడానికి జిల్లా స్థాయిలో వ్యవస్థ లేకపోవడంతో చాలామంది రైతులు కోర్టుల్లో కేసులు వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే కాస్తు కాలం తీసివేయడంతో చాలామంది పట్టాదారులు తమ భూములు అంటూ ఆక్రమించడంతో వివాదాలు చెలరేగాయి. అలాగే సాదాబైనామాలు రాసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోని వారి వివాదాలు నెలకొనగా.. కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ధరణిలో సమస్యల పరిష్కారానికి కొందరు అధికారులు అవినీతికి

(మిగతా 6లో..)

కంచే చేను మేస్తోంది

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులే పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు

- ఆన్‌లైన్ ఇసుకకు అనుమతులు ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం
- జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన పలు రీచ్‌లకు డీడీలు కట్టిన ట్రాక్టర్ యజమానులు
- ఆఫీసర్లు పర్మిషన్ ఇవ్వకపోవడంతో ఆందోళనలకు దిగుతున్న పరిస్థితి
- స్థానిక నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఆన్‌లైన్ బుకింగ్ కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- ఫిల్టర్ ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్న దళారులు
- టిప్పర్ ఇసుక ధర రూ.35 వేలు.. ట్రాక్టర్ ధర రూ.6 వేలు..

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఒక వైపు ప్రభుత్వం చెబుతుంటే.. అందుకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు పాలమూరు జిల్లాలో రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరాకు అనుమతులు ఇచ్చి, అటు ప్రభుత్వానికి ఆదాయం తేవడంతో పాటు ఇటు ప్రజలకు తక్కువ ధరకు ఇసుకను అందించాల్సిన వారు.. అనుమతులు ఇవ్వకుండా దళారులకు అండగా నిలబడుతున్నారు. ఇసుక రీచ్‌లను గుర్తించినా అనుమతులు ఇవ్వకపోవడం వెనుక ఆంతర్యమేంటని డీడీలు కట్టిన ట్రాక్టర్ల యజమానులు, బుకింగ్ చేసుకున్న బాధితులు ప్రశ్నిస్తున్నారు. అదే అదనుగా ఇసుకాసురులు ఫిల్టర్ ఇసుకను తయారు చేసి, వేల రూపాయలు కూడబెట్టుకుంటున్నారు.
- మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)


పోల్కంపల్లి-తిమ్మాపూర్ ఇసుక రీచ్ వద్ద ఇసుకను ట్రాక్టర్‌లకు నింపేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్(ఫైల్)

ఎక్కడైనా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం కలెక్టర్‌లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసినా, మహబూబ్‌నగర్ జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది. ప్రజల ఇళ్లకు, ఇందిరమ్మ ఇళ్లకు తక్కువ ధరకే ఇసుక సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా జిల్లాలో అమలు కావడం లేదు. మన ఇసుక వాహనం పేరిట ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి సరఫరా చేసేందుకు జిల్లాలో పలు రీచ్‌లను గుర్తించినా, వాటికి అనుమతులు ఇవ్వడానికి అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా ఎప్పటిలాగే అక్రమ రవాణా సాగుతోంది. ఎక్కడికక్కడ ఫిల్టర్ ఇసుకను తయారు చేసి, విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ దందా సాగుతోంది. ఇందుకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. భారత్ బెంజ్ టిప్పర్ ఇసుకను రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు, ట్రాక్టర్ ట్రిప్పు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఇసుక సరఫరా చేస్తున్నారు. ఇందులో అధికంగా ఫిల్టర్ ఇసుకనే ఉంటోంది. అదే మన ఊరి వాహనం ఇసుకకు అనుమతిస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతోపాటు వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభిస్తుంది. ట్రాక్టర్ యజమానులకు ఉపాధి చూపినట్లవుతుంది. వీటన్నింటిని పక్కన పెట్టి అధికారులు అక్రమ దందాకే పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



మన ఇసుక వాహనానికి అనుమతి ఇవ్వాలని మూసాపేట తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ యజమానులు(ఫైల్)

మన ఇసుక వాహనానికి అనుమతివ్వని యంత్రాంగం

జిల్లాలోని మూసాపేట మండలం పోల్కంపల్లి, తిమ్మాపూర్, కొమిరెడ్డిపల్లి అడ్డాకుల మండలం కన్మనూర్, కోయిలకొండ మండలం సూరారం, ఆచార్యాపూర్, కుసుమహ్మద్‌పల్లి, మిడ్జిల్ మండలం కొత్తపల్లి, దేవరకద్ర మండలం గోప్లాపూర్‌లో అధికారులు ఇసుక రీచ్‌లను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడి నుంచి ఇసుక రవాణా చేపట్టారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని ఇసుక రీచ్‌ల పరిధిలోని ఆసక్తి గల ట్రాక్టర్ యజమానులతో రూ.25 వేలు డీడీ తీయించి, ఇసుకను సరఫరా చేసేందుకు అనుమతిచ్చారు. ఒక్కో రీచ్ పరిధిలో 50-80 వరకు ట్రాక్టర్‌లు ఉన్నాయి. ఇసుక సరఫరా ప్రారంభమైతే ట్రాక్టర్ యజమానులకు ఒక మెసేజ్ వస్తుంది. ఆ తరువాత ఓటీపీ వస్తుంది. అనంతరం ఫలానా చోటకు ఇసుకను సరఫరా చేయాలని వచ్చిన మెసేజ్ ఆధారంగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. దూరాన్ని బట్టి ట్రాక్టర్ అద్దె ఎంత తీసుకోవాలో ముందే మెసేజ్ వస్తుంది. ట్రాక్టర్ యజమానితోపాటు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ చేసిన వ్యక్తికి కూడా ఎంత అద్దె చెల్లించాలో మెసేజ్ వెళ్తుంది. ప్రస్తుతం వేసవి కావడంతో వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల రీచ్‌ల నుంచి మెయిన్ రోడ్డు వరకు వచ్చే బాటలకు ఇబ్బంది ఉండదని, వర్షాలు పడి విత్తనాలు వేస్తే ట్రాక్టర్‌లు వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని వాహనాల యజమానులు అంటున్నారు. అందుకే ఈ ఏప్రిల్, మే నెలల్లోనే ఆన్‌లైన్ ఇసుక సరఫరా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాక్టర్ యజమానుల ఆందోళన బాట

మూసాపేట మండలం పోల్కంపల్లి రీచ్ పరిధిలో పోల్కంపల్లి, తిమ్మాపూర్, రావులపల్లి, జానంపేట, కొమ్మిరెడ్డిపల్లి, వేముల, మూసాపేటకు చెందిన 80 ట్రాక్టర్‌లు ఉన్నాయి. వీళ్లంతా ఇదివరకే డీడీలు చెల్లించారు. రెండు, మూడు నెలల క్రితమే ఆన్‌లైన్‌లో 300-400 ట్రిప్పులను బుక్ చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు కూడా వెళ్లి పోల్కంపల్లి-తిమ్మాపూర్ శివారు పరిధిలోని మూడు ప్రాంతాలలో ఇసుక రవాణాకు స్థలాలను గుర్తించారు. వాగు నుంచి మెయిన్ రోడ్డు వరకు బాటలు చేసుకోవాలని రెండు నెలల క్రితమే సూచించారు. దాంతో పొలాల యజమానులతో మాట్లాడుకుని, బాటలు కూడా సిద్ధం చేసుకున్నారు. అందుకోసం అధిక మొత్తంలోనే ఖర్చు పెట్టారు. తీరా అధికారులు మాత్రం ఆన్‌లైన్ ఇసుకకు అనుమతి ఇవ్వకపోవడంతో పలుమార్లు వారి చుట్టూ తిరిగారు. నాలుగురోజుల క్రితం ఇసుక రీచ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే, తహసీల్దార్‌లకు వినతులు కూడా సమర్పించారు. తమకు ఉపాధిలేక ఇబ్బంది పడుతున్నామని, ఆన్‌లైన్ ఇసుక ప్రారంభించాలని కోరారు. ఈ రీచ్ అందరికీ సెంటర్ కావడంతోపాటు వినియోగదారులకు తక్కువ దూరం కావడంతో తక్కువ ధరకే ఇసుక లభించనుంది.

అడ్డుకుంటున్న నాయకులు

ప్రస్తుతం అడ్డాకుల మండలం కన్మనూర్, పొన్నకల్, పెద్దమందడి మండలం కమాలుద్దీన్‌పూర్ రీచ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. తమ రీచ్‌ను కూడా ప్రారంభించాలని ఆయా ప్రాంతాల ట్రాక్టర్ యజమానులతోపాటు ఇసుక అవసరం ఉన్న వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు .మన ఇసుక వాహనంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందే తప్ప.. తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఈ ఇసుకపై కన్నేసిన స్థానిక నాయకులు అనుమతివ్వకుండా పైరవీలు చేసి అడ్డుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

అదనంగా తరలింపు

కోయిలకొండ మండల పరిధిలో ప్రభుత్వ సీసీ రోడ్లకు రూ.600 డీడీలు తీసి ఇసుకను తరలిస్తున్నారు. ఒక ట్రిప్పుకు డీడీ తీసి, రెండు, మూడు ట్రిప్పులు అదనంగా తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా పలు రీచ్‌ల సమీపంలోని రైతులు ఇసుక తరలిస్తే తమ బోర్ల రీచార్జి తగ్గుతుందని ఇసుక తరలింపునకు అవకాశం ఇవ్వొద్దని అధికారులకు వినతులు ఇస్తుండటం గమనార్హం.

మరో ఇద్దరి మృతదేహాల వెలికితీత

- జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలింపు
- దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలోని క్వారీలో మునిగిన రెస్క్యూ

7

నవాబ్‌పేటలో భారీ వర్షం

- రుద్రారం, హజిలాపూర్, చాకల్‌పల్లిలో వడగండ్ల వాన

6

రేపు మద్దూరుకు మంత్రి పొంగులేటి రాక

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్


పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించడానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 17న మద్దూరుకు రానున్నట్లు నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఆ రోజు భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రెవెన్యూ బృందాలు గ్రామాల్లో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తాయని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తహసీల్దార్లు, ఆర్‌ఐలతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ భారతి చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం మద్దూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. మండలంలో భూ సమస్యలు ఉన్నవారు పరిష్కరించుకునేందుకు దస్తావేజులు, డాక్యుమెంట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామ సదస్సులను నిర్వహించి, భూ భారతి చట్టం ప్రకారం సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం, లోకల్ బాడి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో రాంచందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో పనుల పరిశీలన

- త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ విజయేందిర బోయి


జడ్చర్ల మండలంలోని దేవునిగుట్ట తండా సమీపంలో పునరావాస పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

జడ్చర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న గ్రామాల నిర్వాసితులకు కల్పించే పునరావాస కేంద్రంలో జరుగుతున్న పనులను కలెక్టర్ విజయేందిరబోయి మంగళవారం పరిశీలించారు. జడ్చర్ల మండలంలోని దేవునిగుట్టతండాకు వెళ్లే దారిలో ఉన్న పునరావాస కేంద్రాన్ని ప్రాజెక్టు ఇంజనీర్లు, మిషన్‌భగీరథ, విద్యుత్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి చూశారు. లెవలింగ్ పనులను పరిశీలించారు. వాటర్ ట్యాంక్‌లు, డ్రైనేజీ నిర్మాణాలను, వల్లూరు, ఉదండాపూర్‌తో పాటు ఒంటిగుడెస తండా, రేగడిపట్టి తండా, తుమ్మలకుంట తండా, చిన్నగుట్ట తండా, శ్యామగడ్డ తండాల ముంపువాసులకు కేటాయించే ప్లాట్ల లేఅవుట్‌ను, పునరావాసం కోసం సేకరించిన 299 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ పరిశీలించారు. ఏయే గ్రామాల ముంపువాసులకు ఎక్కడెక్కడ ప్లాట్లు కేటాయిస్తున్నారనే అంశాన్ని అధికారులనడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పునరావాస కేంద్రానికి తమ భూములను సేకరించారని, పరిహారం అందలేదంటూ కొందరు బాధితులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పరిహారం వచ్చే వరకు పనులను నిలిపివేయాలంటూ కోరారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని, పనులను ఆపవద్దని ఈ సందర్భంగా వారికి కలెక్టర్ సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి కావాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో అనిల్‌కుమార్, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, ఇరిగేషన్‌శాఖ ఎస్‌ఈ చక్రదరం, ఈఈలు రమేశ్ జాదవ్, ఉదయ్‌శంకర్, పీఆర్ ఈఈ నరేందర్, మిషన్‌భగీరథ ఈఈ పుల్లారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం మేరకే దేశ పాలన

- మేధావుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అరుణ

మహబూబ్‌నగర్ క్లాక్ టవర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం విధి విధానాలను అనుసరిస్తూనే పీఎం మోదీ దేశ పాలన సాగిస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు పి.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మేధావుల సదస్సును ఏర్పాటు చేశారు. ఎంపీ అరుణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు దేశ చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తారని రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతపట్టుకొని ప్రచారం చేస్తున్నారని, అది ఎవరితరం కాదన్నారు. కాంగ్రెస్ ఇప్పటికి 74 సార్లు రాంజ్యాంగాన్ని మోసం చేసిందని, 88 సార్లు అవమాన పరిచిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈదురు గాలులు

- రేకుల డబ్బా మీద పడి మహిళా రైతు మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజు


అయ్యమ్మ(ఫైల్)

మూసాపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బలమైన గాలి వీడయంతో రేకుల డబ్బా మీదపడి మహిళ మృతి చెందిన సంఘటన మూసాపేట మండలం వేముల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వేముల గ్రామానికి చెందిన మహిళా రైతు అల్వాయిపల్లి అయ్యమ్మ(60) కోజెంట్ పరిశ్రమ సమీపంలోని రోడ్డుపై వరి ధాన్యం ఆరబోసింది. సాయంత్రం బలమైన గాలులతో వర్షం కురిసింది. దాంతో అక్కడే వ్యవసాయ పొలంలో కిరాణం కొట్టు పెట్టడానికి తెచ్చిన పెట్టిన రేకుల డబ్బా అంచుకు వెళ్లి నిలబడింది. గాలివేగం పెరిగి, ఆ డబ్బా ప్రమాదవశాత్తు అయ్యమ్మపై పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు, రైతులు వచ్చి ఆమెపై పడిన డబ్బాను తొలగించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. ఆమె మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. అయ్యమ్మకు భర్త మలప్ప, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ ఆర్.రాజు పరిశీలించారు. స్థానికులు, బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని చెప్పారు.



నవాబ్‌పేటలో తడిసిన ఇటుకలు



కోయిలకొండ వడగండ్ల వానకు నేలపై పడిన వరి పంట

నవాబ్‌పేటలో భారీ వర్షం

- రుద్రారం, హాజిలాపూర్, చాకల్‌పల్లిలో వడగండ్లు
- హన్వాడ మండలంలో రెండు గేదెలు మృతి

నవాబ్‌పేట/కోయిలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు మెరుపులతో అక్కడక్కడ వర్షం కురిసింది.



రుద్రారంలో కురిసిన వడగండ్లు

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో అకాల వర్షం అతలాకుతలం చేసింది. చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది. దీంతో అన్నదాతకు తీరని నష్టం జరిగింది. రుద్రారం, యన్మనగండ్ల, దయపంతులపల్లి, చాకల్‌పల్లి, నవాబ్‌పేట, కొల్లూర్, బట్టోనిపల్లి, కొండాపూర్, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సుమారు 180 ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. నిన్న మొన్నటిదాక నీరులేక ఎండిన పంటలు ఇప్పుడు చేతికొచ్చిన వరి పంట నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యన్మనగండ్లలో చెలిమె శేఖరయ్య, దేవ నాయక్ లకు చెందిన ఇటుక బట్టీలు ధ్వంసమయ్యాయి. మరికల్ గ్రామంలో దివిటి భీమయ్యకు చెందిన మామిడి తోటలోని మామిడి కాయలు నేలరాలాయి. పుట్టోనిపల్లిలో సైతం కౌలు రైతుకు చెందిన తోటలో మామిడి కాయలు నేలరాలాయి.

కోయిలకొండ మండలంలో గాలి, వడగండ్ల వానతో కోతకు వచ్చిన వరి పంట నెలరాలింది. దీంతో పాటు రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. ఒక్కసారిగా వచ్చిన గాలి వానతో ధాన్యంపై వేసిన తార్‌పాల్‌లు కొట్టుకుపోయి ధాన్యం నీటితో తడిసిపోయింది. చేతికి వచ్చిన వరి పంట నేలపై పడి ధాన్యం నెలరాలింది.

పిడుగు పాటుకు రెండు గేదెలు మృతి

హన్వాడ మండలంలోని దాచకపల్లి గ్రామానికి చెందిన వడ్డె మాసయ్యకు చెందిన రెండు గేదెలు పిడుగు పడటంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.



మరికల్‌లో నేలరాలిన మామిడి కాయలు

పైలెట్ ప్రాజెక్టుగా మద్దూర్

5వ పేజీ తరువాయి

పాల్పడటం, తప్పులు చేసినా.. పరిష్కారం వారి వద్ద లేకపోవడంతో ఆత్మకూరు, వీపనగండ్ల తదితర మండలాల్లో చాలా ఇబ్బందులు తలెత్తాయి. బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఓడిపోవడానికి ఈ ధరణి కూడా ఒక కారణంగా చెబుతారు.

పది మాడ్యూల్స్..

ధరణి ఏర్పాటు చేసినప్పుడు ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయో గుర్తించకుండానే పోర్టల్‌ను ప్రారంభించారు. రిజిస్ట్రేషన్లలో వేగం పెరిగింది కానీ.. సమస్యలు వచ్చినప్పుడల్లా కొత్త మాడ్యుల్స్‌ను తయారు చేసుకుంటూ వెళ్లారు. ఇంకా సమస్యలకు సంబంధించిన కొన్ని మాడ్యూల్స్ ఏర్పాటు కూడా కాలేదు. కానీ భూభారతి పోర్టల్‌లో ప్రస్తుతం ఉన్న అంచనా ప్రకారం పది మాడ్యూల్స్‌తో ఏర్పాటు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలు, నాలా, ఆర్‌వోఆర్ కరెక్షన్, అప్పీల్, భూముల వివరాలు, ఇతరాల పేరిట మాడ్యూల్స్‌ను రూపొందించారు.
ప్రస్తుతం ఎంపిక చేసిన మద్దూర్ పైలెట్ మండలంలో 30 వేల ఎకరాల భూమి ఉండగా.. గురువారం నుంచి రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. రైతులకు ఉన్న భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామాల వారీగా అందిన ఫిర్యాదులు, భూభారతి చట్టం ద్వారా తీసుకోనున్న చర్యలను పరిశీలించి.. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను పునరుద్ధరించనున్నారు. వారి ద్వారా పరిష్కారం చేసి, రికార్డులు నిర్వహిస్తారు. నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద జూన్ 2 నుంచి భూభారతి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

పాస్టర్ సంగీత ప్రదర్శనకు గిన్నిస్ బుక్ గుర్తింపు

కొత్తకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట పట్టణానికి చెందిన పాస్టర్ జీసీ పాల్‌కు అరుదైన గౌరవం దక్కింది. గిన్నిస్ బుక్ వరల్డ్‌లో స్థానం లభించింది. మండల కేంద్రంలోని వడ్డెవాట రోడ్డు ప్రాంతంలో యేసు ప్రభువు ప్రార్థన మందిరం నడుపుతున్న పాస్టర్ పాల్ గత ఏడాది డిసెంబర్‌లో ఆన్‌లైన్లో నిర్వహించిన ప్రపంచ సంగీత పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్, మణికొండలోని ది లైఫ్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ నిర్వాహకుల చేతులమీదుగా బంగారు పతకం, ధ్రువపత్రాలను అందుకున్నారు.



గోల్డ్ మెడల్, సర్టిఫికట్‌తో పాస్టర్ జీసీ. పాల్

రైలులో నుంచి జారి పడి యువకుడి మృతి



మృతి చెందిన భరత్ కుమార్ రెడ్డి ఫైల్

దేవరకద్ర/ అమరచింత, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండల పరిధిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. రైల్వే ఎస్ఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, అమరచింత మండల కేంద్రానికి చెందిన సురేందర్ రెడ్డి, శారద దంపతుల రెండో కుమారుడు భరత్‌కుమార్ రెడ్డి (24) సిద్ధిపేటలోని ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అమరచింతకు వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున ఆయన హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధం కాగా, తండ్రి సురేందర్‌రెడ్డి మదనాపూర్ (వనపర్తి రోడ్) రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కించి వచ్చాడు. దేవరకద్ర - కౌకూర్ మధ్యలో భరత్‌కుమార్‌రెడ్డి రైల్లో నుంచి కిందపడి మృతి చెందాడు. అతడు ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఆ విషయాన్ని ప్రయాణికులు ఎవరూ గమనించలేదు. రైలు కాచిగూడ స్టేషన్‌కు చేరుకున్న తరువాత రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా ఆయన బ్యాగు కనిపించింది. అందులోని ఐడీ కార్డు చూసి, కళాశాలకు సమాచారం అందించారు. వారు భరత్ తల్లిదండ్రులకు విషయాన్ని తెలిపారు. వెంటనే వారు ఫోన్ చేయగా ఎవరూ స్పందించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఫోన్ లొకేషన్ ఆధారంగా భరత్ పడి ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ భరత్ మృతదేహాన్ని చూసిన వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పైనుంచి వెళ్లడంతో డ్రైవర్‌కు గాయాలు

- సోషల్ మీడియాలో వైరల్..

మిడ్జిల్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన డ్రైవర్ పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అతనికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మిడ్జిల్, కొత్తూరు గ్రామాల మధ్యన గల దుందుభీ వాగు నుంచి ఇసుకను తరలించేందుకు సదరు డ్రైవర్ ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. ఇసుక నింపాక.. ట్రాక్టర్‌ను బయటకు తీసే క్రమంలో కొండి విరగడంతో డ్రైవర్ కిందపడ్డాడు. దాంతో ట్రాక్ అతనిపై నుంచి వెళ్లింది. గాయపడిన అతన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై స్థానిక ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడును వివరణ కోరగా... తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



తోమాలపల్లి సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

పెబ్బేరు రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మండలం తోమాలపల్లిలో నిరుపయోగంగా ఉన్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని రైతులు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ 8 సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉందని దాని ద్వారా ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తోమాల పల్లి, వైశాగాపూర్, రామమ్మపేట, కొత్తూరు గ్రామాల్లో వరితో పాటు మామిడి, బత్తాయి అనేక తోటలు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీ, ఏఈకి చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ పనులను కొత్తకోట గ్రామానికి చెందిన ఓ నాయకుడు అడ్డుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి శుభ ముహూర్తాలు

- వివాహాలు, శుభకార్యాలకు అనుకూలం
- 30న రికార్డు స్థాయిలో పెళ్లిళ్లు



జీలకర్ర బెల్లంతో నూతన వధూవరులు



కన్యాదానం చేస్తున్న దృశ్యం

నారాయణపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పచ్చని పందిర్లు.. ముత్యాల తలంబ్రాలు.. మేళ తాళాల మధ్య వివాహ వేడుకలు.. బంధు మిత్రుల సందడి.. కొత్త జంటలకు పెద్దల దీవనలు.. వెరసి ఊరూరా సందడి నెలకొననున్నది.. బుధవారం నుంచి వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలున్నాయి. ఇప్పటికే చాలా మంది తమ పిల్లల పెళ్లిళ్లకు ముహూర్తాలు పెట్టుకొని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత నెల 30న ఉగాది పండుగ నాడు ప్రారంభమైన చైత్ర మాసం ఈ నెల 27 వరకు కొనసాగనున్నది. ఆ తర్వాత వైశాఖ మాసం 28 నుంచి వచ్చే నెల 27 వరకు ఉంటుంది. ప్రస్తుత చైత్ర మాసంలో 16వ తేదీ నుంచి శుభ ముహూర్తాలున్నాయి. ఆ రోజు నుంచి పెళ్లిళ్ల సందడి మొదలు కానున్నది. ఆ తర్వాత వైశాఖ మాసంలో ఏప్రిల్ 30న అక్షయ తృతీయ, బసవజయంతి రోజు మంచి ముహూర్తం ఉండటంతో రికార్డు స్థాయిలో వివాహాలు జరుగనున్నాయి. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా దాదాపు 1500 పెళ్లిళ్లు జరుగవచ్చని అంచనా. అలాగే గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు కూడా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బంగారు, వెండి ఆభరణాల దుకాణాల్లో రద్దీ కనిపిస్తోంది. ఎక్కువ సంఖ్యలో వివాహాలు జరుగుతున్నందున ముందుగానే ఫంక్షన్ హాళ్లు బుక్ అయిపోయాయి. దీంతో ఆలయాల్లోని కల్యాణ మండపాలు, ఇళ్ల ఆవరణలు, కాలనీల్లోని విశాలమైన స్థలాల్లో పెళ్లిళ్లు జరుపుకునేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే పురోహితులు, బ్యాండు మేళాలు, సన్నాయి వాయిద్యాల వారికీ చేతినిండా పని దొరకనున్నది.

జూన్ 8న చివరి పెళ్లి ముహూర్తం ఉంది. ఆ తర్వాత ఎవరైనా పెళ్లిళ్లు జరుపుకునేందుకు నవంబరు 23 వరకు ఆగాల్సి వస్తుంది.

వివాహ శుభ ముహూర్తాలు

చైత్ర మాసంలో ఏప్రిల్ 16, 18, ,20, 21, 25 తేదీల్లో శుభ ముహూర్తాలున్నాయి. వైశాఖ మాసంలో ఏప్రిల్ 30న మంచి ముహూర్తం ఉంది. అలాగే మే నెలలో 1, 5, 7, 8, 9, 10, 14, 16, 17, 18, 23 తేదీల్లో శుభమూహూర్తాలున్నాయి. జేష్ఠ మాసంలో జూన్ 2, 4, 6, 8 తేదీలతో వివాహ ముహూర్తాలు ముగియనున్నాయి. మళ్లీ నవంబర్ 23 తర్వాత మార్గశిర మాసం వరకు నుంచి శుభ మూహూర్తాలు ఉన్నాయి.

తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి



రఘుపతిపేట గుట్టను పరిశీలిస్తున్న జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



తహసీల్దార్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేస్తున్న జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

- బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేట దేవాలయానికి సంబంధించిన గుట్టపై తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. రఘుపతిపేట రామగిరి దేవాలయం గుట్టపై తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ తహసీల్దార్, సీఐ నాగార్జున, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నరేష్‌గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, కృష్ణగౌడ్, నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, నరసింహ, శ్యాంసుందర్, శ్రీశైలం, సురేందర్‌గౌడ్, నరేశాచారి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన క్రియాశీల సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మాక్‌డ్రిల్‌తో అగ్ని ప్రమాదాలపై అవగాహన

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రమాదాల తీవ్రతను ఎలా నియంత్రించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమాలు, ప్రత్యక్ష మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వాడే విధానం, అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా బయటపడే మార్గాలను వివరించారు. రియల్ టైమ్, రెస్క్యూ, ఫైర్ కంట్రోల్ ప్రక్రియను ప్రదర్శించారు. అనంతరం ఫైర్ సేఫ్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక అధికారి మల్లిఖార్జున్, లీడింగ్ ఫైర్‌మెన్ రాజేందర్, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండ్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు వేసవిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాల నిర్వహణకు జాతీయ స్థాయి క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. సీనియర్ క్రీడాకారులు వారు క్రీడా పోటీల్లో పాల్గొన్న ధ్రువపత్రాలతో ఈ నెల 22లోగా క్రీడాశాఖ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతలను బట్టి కోచ్‌లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అంతం కాని అన్వేషణ

- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న తవ్వకాలు
- నేటికీ దొరకని ఆరుగురు కార్మికుల ఆచూకీ
- 50 మీటర్ల మేర తిరగతోడినా దొరకని ఆనవాలు



తవ్వకాల్లో బయట పడిన సెగ్మెంట్ బ్లాక్స్ లిఫ్టింగ్ మిషన్

దోమలపెంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో చిక్కుకుపోయిన వారి కోసం అన్వేషణ అంతం కావడం లేదు. సొరంగంలో 13.730 మీటర్ల నుంచి 13.800 మీటర్ల వరకు మూడవ సారి కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించారు. శిథిలాలు ఇంకా 70 మీటర్ల మేర, 15 నుంచి 25 అడుగుల ఎత్తు వరకు పేరుకుపోయి ఉండగా, రెస్క్యూ బృందాల సభ్యులు మంగళవారం నాటికి అందులో 30 మీటర్ల మేర తవ్వకాలు జరిపి శిథిలాలు, బురద, మట్టి బయటకు తరలించారు. మిగిలిన 40 మీటర్లను పూర్తిగా తిరగతోడినప్పటికీ శిథిలాల కింద చిక్కుకున్న 6 గురు కార్మికులకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదు. ఈ నెల 18 వరకు శిథిలాలను పూర్తిగా తరలించేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. డేంజర్ జోన్‌గా ప్రకటించిన 43 మీటర్ల ప్రాంతంలో, 30 అడుగుల మేర శిథిలాలు నిండుకు పోయి ఉన్నాయి. బురద, మట్టి కూరుకుపోయిన టీబీఎం మిషన్ ఉన్న ప్రాంతంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు చెప్తున్నారు. డేంజర్ జోన్‌గా ఉన్న 43 మీటర్లలో 10 మీటర్ల వరకు తవ్వకాలు చేట్టేందుకు కొంత అవకాశం ఉంది. డీ1 ప్రాంతంలో బలహీనంగా ఉన్న సెమెంట్ సెగ్మెంట్లకు సపోర్టుగా సింగరేణి కార్మికులు టైగర్ క్లాక్స్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ తవ్వకాలు చేపడితే ఏం జరుగుతుందో అన్న భయం సిబ్బందిలో నెలకొన్నది. ఆ ప్రాంతంలో శిథిలాలను పూర్తిగా బయటకు తరలిస్తే ఏ మూలనన్నా కార్మికుల ఆచూకీ లభించే అవకాశాలు ఉండొచ్చన్న ఆశతో సిబ్బంది, అధికారులు ఉన్నారు. కానీ అక్కడ కూడా కార్మికుల ఆచూకీ దొరకకపోతే పరిస్థితి ఏంటన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందోనన్న చర్చ కొనసాగుతోంది.



రెస్క్యూ బృందాల అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

రెస్క్యూ బృందాల శ్రమ వెలకట్టలేనిది

రెస్క్యూ సిబ్బంది శ్రమ వెల కట్టలేనిదని ప్రతేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కార్యాలయంలో మంగళవారం ఆయన రెస్క్యూ బృందాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొరంగంలో ప్రమాదకరంగా ఉన్న డీ-2 ప్రాంతంలో సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. 53 రోజులుగా నిరంతరాయంగా తవ్వకాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. టీబీఎం మిషన్ శకలాలు బురద మట్టిలో కూరుకుపోయి బిగుసుకుపోయి ఉన్నందున వాటర్ జెట్‌ల ప్రెషర్‌తో బురదను తొలగిస్తున్నట్లు చెప్పారు. కత్తిరించిన ఇనుప గడ్డరను, పెద్ద బండరాళ్లను లోకో ట్రైన్‌లో బయటకు పంపుతున్నామన్నారు. ఉబికి వస్తున్న ఊట నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. రాత్రింబవళ్లు శ్రమిస్తున్న సహాయక సిబ్బందికి అవసరమైన మందులు, పౌష్టికాహారం తదితర వసతులను సమకూర్చినట్లు చెప్పారు. సహాయక చర్యల్లో సింగరేణి జీఎండీ బైద్య, రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే అధికారి రవీంద్రనాథ్, జీఎస్ఐ, ఇరిగేషన్, జెపీ కంపెనీ ప్రాజెక్టు సీనియర్ ఇంజనీర్ సంజయ్‌కుమార్ సింగ్, వివిధ శాఖ అధికారులు పాల్గొంటున్నారు.

క్రైం కార్నర్

మరో ఇద్దరి మృతదేహాల వెలికితీత

▸ జనరల్ ఆసుపత్రి మార్చురీకి తరలింపు



మహమూద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



అయ్యప్ప మృతదేహం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : క్వారీలో ఈతకు వెళ్ళి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలను మంగళవారం వెలికితీశారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ సుపత్రికి తరలించారు. నగరంలోని దివిటిపల్లి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో నివాసం ఉండే ముగ్గురు యువకులు పక్కనే ప్రభుత్వ మెడికల్ కళాశాల వెనకనున్న పాత క్వారీలో ఈతకు వెళ్ళి గుల్లంతయ్యారు. వారిలో విజయ్ కుమార్ మృతదేహం సోమవారమే లభ్యమైంది. రాత్రి వరకు గాలించినా మిగిలిన వారి మృతదేహాలు లభించలేదు. దీంతో మంగళవారం ఉదయమే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది క్వారీలో గాలింపు మొదలు పెట్టారు. మధ్యాహ్నం ఎండీ మహమూద్ మృతదేహం, సాయంత్రం అయ్యప్ప మృతదేహం లభ్యమయ్యాయి. వాటిని బయటకు తీయగానే కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలను జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. బుధవారం పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. సోమవారం లభించిన విజయ్‌కుమార్ మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టమ్ పూర్తి చేసి, కుటుంబసభ్యులకు అప్పగించగా, అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదంపై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

జడ్చర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత, 1:30 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (60) రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపటడ్తున్నామని సీఐ తెలిపారు.

భార్య మృతి కేసులో భర్త అరెస్టు

▸ రిమాండ్‌కు తరలింపు

ఇటిక్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో భార్యను తీవ్రంగా కొట్టి, ఆమె మృతికి కారణమైన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సాతర్ల గ్రామానికి చెందని షాలు, అతడి భార్య సంసీన్‌ల మధ్య గత నెల 30న గొడవ జరిగింది. ఆ సమయంలో క్షణికావేశానికి గురైన షాలు భార్య సంసీన్‌ను రోకలి బండతో కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. తల్లి మాసూంబీ ఆమెను చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 4న మృతి చెందింది. ఈ మేరకు మాసూంబీ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి అలంపూర్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు

వడ్డేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ చేయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐపీఎల్ క్రికెట్‌పై జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామానికి చెందిన వీరేంద్రాచారి బెట్టింగ్ నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో విచారణ చేపట్టి అతడిపై కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు మరో ఆరుగురిని కూడా విచారించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొడ్డలితో నరికి వ్యక్తి హత్య

▸ కుమారుడి వివాహేతర సంబంధమే కారణం!



పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన జనం

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కొందరు దుండగులు గొడ్డలితో నరికి ఓ వ్యక్తిని హత్య చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే దారిలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామానికి చెందిన బోరం వీరయ్య (48), మరో ఇద్దరితో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మహేష్ గౌడ్, మరో ఇద్దరితో కలిసి కారులో వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఆ తర్వాత వారు కారులో నుంచి దిగి, పడిపోయి ఉన్న బోరం వీరయ్యను గొడ్డలితో నరికి చంపారు. వాస్తవానికి వీరయ్య కుమారుడు పరమేశ్‌యాదవ్‌ను చంపాలని పథకం వేశారని, కానీ అతడు ద్విచక్రవాహనంపై లేకపోవడంతో తండ్రిని హతమార్చినట్లు తెలిసింది. కుమారుడి వివాహేతర సంబంధమే హత్యకు కారణమని తెలుస్తోంది. సంఘటన తర్వాత నిందితులు మహేష్‌గౌడ్, శివ, మరో ఇద్దరు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. సంఘటనపై ఎస్‌ఐ రమేశ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

మిడ్జిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లభురావుపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, కావలి నర్సింహ గొడవపడ్డారని, అదే గ్రామానికి చెందిన సాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు మంగళవారం తెలిపారు. గోపాల్‌రెడ్డి నర్సరీలో పని చేస్తుండేవాడని, నర్సింహ తన మేకలను నర్సరీలో మేపుతుండగా మేపవద్దని చెప్పడంతో గోపాల్‌రెడ్డిపై నర్సింహ కర్రతో దాడి చేశాడు. ప్రస్తుతం గోపాల్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని గోపాల్‌రెడ్డి బావ సాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

చేతనైనంత కాలం చేయాలి పని



▸ చిరు వ్యాపారంతో జీవనోపాధి ▸ యువతకు ఆదర్శంగా వృద్ధులు

అయిజ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : "చేతనైనంత కాలం పని చేయాలి.. వయసు 60 దాటినంత మాత్రాన బాధ పడాల్సిన పనేముం ది.. వయసుదేముంది.. ఏటికేడు పెరుగుతనే ఉంటది.. సొంత అవసరాల కోసం ఎవరిపైనా ఆధారపడకుండా బతకాలి.. అయినవారైనా సరే.. కాని వారైనా సరే.. చేయి చాచి వారిని అడిగే అవసరం లేకుండా జీవించాలి" అంటున్నారా వృద్ధులు. కానీ చిన్న చిన్న సమస్యలకే కుంగిపోతున్నారు కొందరు యువకులు.. సులభంగా లక్షల రూపాయలు సంపాదించాలన్న అడ్డదారులు తొక్కుతున్న వారు మరికొందరు.. బెట్టింగులు, ఆన్‌లైన్ గేమ్స్ పేరుతో డబ్బును తగలేసి అప్పుల పాలవుతున్నారు ఇంకొందరు... ఆశించినది దక్కక కొందరు.. అప్పుల పాలై మరి కొందరు... జీవితాలను ఆగం చేసుకుంటున్నారు.... వారికి బతుకు అర్థాన్ని నేర్పిస్తున్నారీ వృద్ధులు. సమస్య ఉన్న చోటే పరిష్కారమూ ఉంటుందని నిరూపిస్తున్నారు. హాయిగా, ఆనందంగా బతికేందుకు లక్షల రూపాయలు అవసరం లేదని చెప్తున్నారు. ఉన్నదానితోనే సంతృప్తిగా జీవించడం ఎలాగో ఆచరించి చూపిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వారి జీవన శైలిని తెలుసుకున్నది... ఆ వివరాలు..

30 ఏళ్లుగా సీజనల్ వ్యాపారం

- తెలుగు శంకరమ్మ, అయిజ



ఈమె పేరు తెలుగు శంకరమ్మ. అయిజ పట్టణానికి చెందిన ఈమె 30 ఏళ్లుగా ఫుట్‌పాత్ మీద చిన్న బండిపై నిమ్మకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. నిమ్మకాయలతో పాటూ ఆయా సీజన్ల వారీగా గంగ రేగుపళ్లు, మామిడి పళ్ల వ్యాపారం చేస్తోంది. ఎండ, వాన, చలి ఏ కాలమైనా ఆమె మాత్రం తన వ్యాపారాన్ని ఆపలేదు. పొద్దస్తమానం నిమ్మకాయలు అమ్మితే వచ్చే కొంత డబ్బు ఇంట్లో కూరగాయలకు సరిపోతాయని చెప్తోంది. ఆమె భర్త 10 ఏళ్లుగా కాళ్ల నొప్పులతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇద్దరు కొడుకుల్లో ఒకరు రోజూ తోటలకెళ్లి నిమ్మకాయలు తెస్తారు. మరొకరు సీజన్‌లో మామిడి తోటలను గుత్తకు తీసుకొని జీవనం గడుపుతున్నాడు. సొంత పొలం కూడా లేకపోయినా, చిరు వ్యాపారం ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే తామంతా సంతోషంగా జీవిస్తున్నామని ఆమె తెలిపారు. చేసే పని చిన్నదా, పెద్దదా అని చూడకుండా, ప్రతీ ఒక్కరు నడుము వంచి పని చేసుకోవాలని సూచించారు.

కష్టం విలువ తెలుసు

- భీమక్క (ఇందమ్మ), అయిజ

చిన్నప్పటి నుంచి మాకు కష్టం విలువ తెలుసని, అందుకే ఉన్న దాంట్లోనే హాయిగా బతుకుతున్నామని అయిజకు చెందిన భీమక్క చెప్తోంది. ప్రస్తుతం ఈమె వయసు 62 ఏళ్లు. దాదాపు 40 ఏళ్లుగా రోడ్డు పక్కన పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తోంది. సీజనల్‌గా వచ్చే బొప్పాయి, కలంగిరి, జామ, సపోటా తదితర పళ్లు విక్ర యిస్తూ జీవనం సాగిస్తోంది. భర్త మూడేళ్ల క్రితం మరణించాడు. ఇద్దరు కొడుకులున్నారు. వారికి రెండు ఎకరాల పొలం ఉంది. అయినా ఎవరిపైనా ఆధారపడకుం డా బతకాలని, కాళ్లు, చేతులు పని చేసినన్ని రోజులు తనకు నచ్చిన పని చేస్తూ బతకడమే తన ఆలోచన అని ఆమె తెలిపారు. ఎండనకా, వాననకా రోజంతా బండిపై కూర్చుని పండ్లు అమ్మితే రెండు వందల రూపాయల వరకు వరకు మిగులుతాయని చెప్పారు. రోజూ ఇంటి నుండి పండ్లను తీసుకు రావడం, తీసుకెళ్లడం, ఆటోకు రూ.60 ఖర్చు కాగా రూ. 100 నుంచి రూ. 140 వరకు ఆదాయం వస్తోంది. ఉన్న దాంట్లో తృప్తిగా బతకడం మాకు తెలుసని, కానీ నేటి తరం యువతీ, యువకులు పెద్దగా పనిచేయకుండానే డబ్బులు రావాలని ఆరాటపడుతున్నారని, అడ్డదారులు తొక్కుతున్న వారిని చూస్తే చాలా బాధ అనిపిస్తుందన్నారు.



కుటుంబానికి ఆసరాగా ఉండాలని..

- మారెమ్మ, ఎక్లాస్‌పూర్

ఈమె పేరు మారెమ్మ. వయసు 65 ఏళ్లు. అయిజ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఈమె 20 ఏళ్లుగా సీజన్‌లో వచ్చే పండ్ల వ్యాపారం చేస్తోంది. తోటల నుంచి పండ్లు కొని, అయిజలో వీధివీధి తిరుగుతూ విక్రయిస్తూ జీవనం గడుపుతోంది. ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఉన్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కొడుకు, కోడలు బతుకుతున్నారు. తాను కూడా ఏదో ఒక పనిచేసి కుటుంబానికి ఆసరగా ఉండాలని ఈ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాటి ముంజలను వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి, వాటిని అయిజ పట్టణంలో వీధివీధి తిరుగుతూ ప్రజలకు, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల యజమానులకు విక్రయిస్తోంది. మా కాలానికి.. ఈ కాలానికి చాలా తేడా కనిపిస్తోందని ఆమె అంటున్నా రు. చాలా మంది పని చేయకుండానే డబ్బులు రావాలని ఆశ పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న సమస్యలకే భయపడి చనిపోవడం చూస్తే బాధ అనిపిస్తోందన్నారు.



మండు వేసవిలో.. చల్లని తాటి ముంజలు

▸ వేసవి తాపం నుంచి ఊరట

▸ జోరుగా సాగుతున్న విక్రయాలు



పెద్దకొత్తపల్లి సంతలో విక్రయిస్తున్న తాటి ముంజలు



పెద్దకొత్తపల్లిలో తాటి ముంజలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండు వేసవిలో చల్లని తాటి ముంజలు వేసవి తాపం నుంచి ఊరటనిస్తున్నాయి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు జనం శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు తాగడంతో పాటు, తాటి ముంజలను ఎక్కువగా తింటుంటారు. వేసవికే ప్రత్యేక మైన తాటిముంజల విక్రయాలు పెద్దకొత్తపల్లి మండలంలో జోరుగా కొనసాగుతున్నాయి. ప్రతీ మంగళవారం మండల కేంద్రంలో జరిగే సంతలో, ప్రతీ ఆదివారం బస్టాండ్ చౌరస్తాలో, అలాగే నాయినోనిపల్లి మైసమ్మ జాతరల తాటి ముంజలను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వీటి ధర రూ. 100కు 12 నుంచి 15 వరకు ఉంటోంది. వీటి విక్రయాలతో చిరు వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. అలాగే పొలం గట్ల మీద ఉండే తాటి చెట్ల కల్లుతో రైతులకు ఆదాయం లభిస్తోంది. ఈ సీజన్లో తాటి ముంజల విక్రయంతో వారికి లబ్ధి చేకూరుతోంది. మండలంలోని చిన్నకార్పాముల, జగన్నాథపురం, చిన్నకొత్తపల్లి, పాత యాపట్ల, కొత్త యాపట్ల, చంద్రకల్, వేడుకరావుపల్లి, చంద్రబండతాండా తదితర గ్రామాల్లో తాటి చెట్లు అధికంగా ఉన్నాయి. ఈ చెట్లును కన్న తల్లిగా భావిస్తామని రైతులు చెప్తుంటారు. ఈ చెట్ల ద్వారా ఏడాదంతా కల్లు లభిస్తోందని, అలాగే ఈ సీజన్లో ముంజలు వస్తాయని, వాటిని విక్రయించడం ద్వారా ఆర్థిక వెసలుబాటు కలుగుతుందని చెప్తున్నారు. గతంలో తాటి మొద్దులను ఇళ్ల పైకప్పుగా వాడేవారని గుర్తు చేస్తున్నారు. తాటి మట్టలతో అల్లిన చాపలను అప్పట్లో ఎక్కువగా వినియోగించేవారమంటున్నారు. అలాగే తాటి జెగ్గలు వంట చెరుకుగా ఉపయోగపడుతాయని చెప్తున్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

▸ కంచుపాడు, చిప్పదొడ్డి గ్రామాల్లో ఘటనలు



కంచుపాడులో కాలిపోయిన మొక్కజొన్న కంకులను చూపిస్తున్న రైతు

ఉండవల్లి/మల్దకల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కల్లంలో కుప్పగా పోసిన మొక్కజొన్న కంకులు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని కంచుపాడు, మల్దకల్ మండలంలోని చిప్పదొడ్డి గ్రా మాల్లో సోమవారం రాత్రి ఈ సంఘటనలు జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంచుపాడు గ్రామానికి చెందిన రైతు అచ్చెన్న నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మొక్క జొన్న సాగుచేశారు. చేతికి వచ్చిన 40 క్వింటాళ్ల మొక్కజొన్న కంకులను సోమవారం పొలంలో కుప్పలుగా పోసి సాయంత్రం ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం పొలానికి వచ్చే సరికి కంకుల కుప్ప కాలి బూడిదై కనిపించింది. దీంతో దాదాపు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

- మల్దకల్ మండలం చిప్పదొడ్డి గ్రామానికి చెందిన రైతు రవీందర్ చెందిన నాలుగు ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట మంగళవారం ప్రమాదశాత్తూ దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విఠాపురం గ్రామానికి చెందిన రైతు అ క్బర్ తన పొలంలో పంట కోత పూర్తయిన తర్వాత చొప్పకు నిప్పంటించాడు. ఆ నిప్పు రవ్వలు సమీపంలో ఉన్న రైతు రవీందర్ సాగు చేసిన మొక్కజొన్న పంటపై పడి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. పంటతో పాటు డ్రిప్ పైపులు కూడా కాలిపో యాయని బాధితుడు తెలిపారు. దాదాపు రూ. 4లక్షలు నష్టం వాటిల్లిందని చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పి వేసింది.



చిప్పదొడ్డిలో కాలిబూడిదైన మొక్కజొన్న పంట

సనాతన ధర్మానికి ఊపిరి

▸ అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి



భక్తి కళా సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

వంగూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సంకీర్తనా సంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరి అని అన్నమయ్య కళా క్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తి కళా సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సనాతన ధర్మ పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో సొంత డబ్బుతో దేవాలయాన్ని నిర్మించారని చెప్పారు. వచ్చేనెల 7న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద నిర్వహించనున్న హైందవ భక్త జన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లాలూయాదవ్, వేమారెడ్డి, జూపల్లి రాములుయాదవ్, లక్ష్మీశ్వర్, జమ్మయ్య, కవిత, లలిత, సృజనారావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి ఎస్‌ఐకి స్వల్పగాయాలు

ఊర్కొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి అందులో ప్రయాణిస్తున్న ఎస్‌ఐకి స్వల్పగాయాలైన సంఘటన ఆదివా రం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు... ఊర్కొండ ఎస్‌ఐ కృష్ణదేవ హైదరాబాద్ వైపు నుంచి కల్వ కుర్తి వస్తుండగా వెల్దండ మండలంలోని చెరు కూరు సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టిందని అన్నారు. దీంతో ఆయనకు స్వల్పగాయాలు కాగా సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

బైక్ అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యో తి) : జిల్లా కేంద్రంలో పార్కు చేసిన బైక్ అప హరించుకుపోయినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగ ళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన జయప్రకాశ్ గత మార్చి 17న గోపీనాథ్ ఫొటో స్టూడియో ముందు బైక్ పార్కు చేసి పని నిమిత్తం బయటకు వెళ్లగా వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు అపహ రించుకుని వెళ్లారు. చుట్టు పక్కల తనకు తెలిసిన ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టరాదని ఎస్పీ జానకి మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డుపై ధాన్యం కుప్పల కారణంగా ప్రమాదాలు జరిగి, వాహనదారులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీన్ని రైతులు గమనించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. రోడ్లపై కాకుండా అనువైన ప్రాంతాలను చూసుకుని ధాన్యం ఆరబోయాలని, అత్యవసర పరిస్థితుల్లో రోడ్లపై ధాన్యం ఉంచాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆలయ భూముల కౌలుకు రేపు వేలం

జడ్చర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 112 ఎకరాల భూమిని కౌలుకు తీసుకునేందుకు గురువారం ఆలయం వద్ద వేలం వేయనున్నట్లు ఈవో దీప్తిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం ఉంటుందని తెలిపారు.

జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

జడ్చర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధన సమితి కోఆర్డినేటర్లు రమేశ్‌నాయక్, బూర్గుపల్లి కృష్ణయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జడ్చర్ల మండలాన్ని రూరల్, అర్బన్ మండలాలుగా ఏర్పాటు చేయాలని, నవాబ్‌పేట మండలంలో కొల్లూరును మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. జడ్చర్లలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు భవనం నిర్మాణం చేపట్టాలని కోరారు.

ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం ఆర్ఎన్ఆర్ 2191 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2209, కనిష్ఠంగా రూ.1750 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఆముదాలు 23 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.6030, కనిష్ఠంగా రూ.6000, హంస 292 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1769, కనిష్ఠంగా రూ.1639 పలికింది.

పగిలిన పైపులైను

జడ్చర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా జడ్చర్ల మునిసిపాలిటీ సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తీస్తుండగా మంచినీటి సరఫరా అవుతున్న పైపులైను పగిలింది. దీంతో పట్టణంలో మంచినీటి సరఫరాను తాత్కాలికంగా బ్రేక్ పడడంతో సంఘటన స్థలానికి మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్ సతీష్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మునిసిపాలిటీలోని 3, 4, 15, 16, 20వ వార్డులకు నీటి సరఫరా నిలిచిపోయింది. నూతనంగా మరో పైపులైను ఏర్పాటు చేయిస్తామని, రెండు రోజుల పాటు నీటి సరఫరా అంతరాయం ఏర్పడుతుందని చైర్‌పర్సన్ తెలిపారు.

నేడు పట్టణంలో విద్యుత్ కోత

పాలమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలో బుధవారం తాత్కాలిక విద్యుత్ కోత విధిస్తున్నట్లు టౌన్-3 ఏఈ అరుణ్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ టౌన్-1 ఫీడర్ చెట్ల కత్తిరింపు కారణంగా టీచర్స్ కాలనీ, శంకర్‌లింగం ఆసుపత్రి, నలంద ఆటో స్టాండ్, షాషాబ్‌గుట్ట, బీకేరెడ్డి కాలనీ, ఎంపీ సుబ్బారెడ్డి స్కూల్, ఫరూక్‌మసీద్, దోనల్ల ఏరియాల విద్యుత్ కోత విధిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

బీసీ భవనం కేటాయించాలి

పాలమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో 65శాతం ఉన్న బీసీలకు బీసీ భవనం కేటాయించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డికి బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. సారంగం, బుగ్గన్న, రామచంద్రయ్య, చిట్యాల రాములు, వడ్డెర చంద్రయ్య, పురుషోత్తం, అశ్విని సత్యం, డి.కృష్ణ, నాగప్ప, చంద్రశేఖర్, మల్లేష్, నాగేష్, కృష్ణయ్య, సత్యం, ఆశన్న, రాములు, తాయప్ప, గోవర్ధన్, సత్యనారాయణ, కొంకతి రాములు, సతీష్, ఆంజనేయులు ఉన్నారు.

వైభవంగా గిరిజా కల్యాణం



తాళి చూపిస్తున్న అర్చకుడు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న వడ్డెమాన్‌లో రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గిరిజా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజారి వీరేశం, శివశక్తిస్వామి ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా జరిగింది. గిరిజా కల్యాణానికి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమని కవిత పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కుమారస్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాజేశ్వరి, మాజీ ఎంపీటీసీ స్వప్న పాల్గొన్నారు.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

▸ ప్రారంభించారు.. మూసివేశారు ▸ కొనుగోలు చేయకపోవడంతో తడిసిన ధాన్యం ▸ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



కోయిలకొండలో మూతపడిన కొనుగోలు కేంద్రం

కోయిలకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కేంద్రాలు ప్రారంభించిన గంటలకే మూతపడ్డాయి. అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ఫొటోలు తీసుకొని వెళ్లారు.. తప్ప ఇటప్పటికీ కిలో ధాన్యం కూడా కొనలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో ఇప్పటి వరకు ఐకేపీ ద్వారా 8, సింగిల్‌విండో ద్వారా 8 మొత్తం 16 కొనుగోలు కేంద్రాలు ప్రారంభినా ఇప్పటికీ ధాన్యం కొనలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట రోడ్లపై అరబెట్టగా.. వర్షానికి ధాన్యం కొట్టుకుపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు తాళం వేసి ఉన్నాయని, అధికారులకు ఫోన్ చేసిన ఎత్తడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పంటలో లాభం లేకపోయినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో బోనస్ వస్తుందన్న ఆశతో ఉన్నామని, అధికారుల నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వెంటనే కొనుగోలు చేయాలి



మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిన గంటకే మూసి వేశారు. చేను కోసి రోడ్డుపై ధాన్యం అరపోసి ఎండినా కూడా ధాన్యం కొనడం లేదు. ఎండిన ధాన్యం తడిసిపోతోంది.

- శ్రీనివాసులు, రైతు, కోయిలకొండ

వానకు తడిసి పోయాయి..



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకపోవడంతో ఎండిన ధాన్యం తడిసిపోయింది. రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదు. ధాన్యం కొనుగోలు చేయుటకు చర్యలు తీసుకోవాలి.

- రవి, రైతు, కోయిలకొండ

బోనస్ వస్తుందని ఆశతో ఉన్నాం..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో బోనస్ వస్తుందని ఆశతో ఉన్నాం. కొనుగోలు కేంద్రాలు మూతపడడంతో ధాన్యం ఎక్కడ అమ్మాలో తెలియని పరిస్థితి నెలకొంది.

- వెంకట్రాములు, రైతు, కోయిలకొండ

ప్రతీ గింజను కొంటాం

▸ ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి ▸ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతీ చివరి గింజను కొంటామని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగారం, దేవరకద్ర మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. రైతులు దళారులకు విక్రయించి నష్టపోరాదని, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ కూడా ఇస్తుందన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కతలప్ప, వైస్ చైర్మన్ హన్మంతురెడ్డి, కురుమూర్తి ఆలయ చైర్మన్ వేణగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

సహకార సంఘంలోనే విక్రయించాలి

భూత్పూర్ : రైతులు సహకార సంఘంలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సహకార సంఘం అధ్యక్షుడు కదిరె అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెల్కిచర్ల, పాతమొల్గర గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్, ఏవో మురళిధర్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● గండీడ్ : మండలంలోని పెద్దవార్వల్, బల్సూ రగొండ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందం రెడ్డి, పీసీసీ సభ్యుడు నరసింహరావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో ఆశన్న, బాలస్వామి, కొండారెడ్డి, ఏఈవోలు శివలీల, గౌతమి పాల్గొన్నారు.

● మిడ్జిల్ : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మార్కెట్ డైరెక్టర్లు సత్యంగౌడ్, బంగారయ్య, మాజీ ఎంపీటీసీ గౌస్, మాజీ సర్పంచ్‌లు సుమతమ్మ గోపాల్‌రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. ఉరుములు.. వడగళ్లు





టంకర, అడ్డాకుల గ్రామంలో విరిగి పడిన చెట్లు

మహబూబ్‌నగర్/జడ్చర్ల/మూసాపేట/రాజాపూర్/హన్వాడ/బాలానగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అకాల వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇన్నాళ్లు పంటలెండిపోకుండా కాపాడుకోవడానికి అపసోపాలు పడ్డ రైతులకు చివరకు పంట చేతికొచ్చి కోసుకుందామనుకున్న సమయానికి అకాల వర్షాలు తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాలలో వడగళ్లు, ఈదురుగాలులతో వరి, మామిడి పంటలు తీవ్ర స్థాయిలో నష్టపోగా, మంగళవారం కూడా జిల్లాలోని పలు మండలాలలో వర్షంతో పాటు వడగళ్లు కురవడం రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఇక్కడ 2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జడ్చర్ల పట్టణంలో సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు, ముసురు వర్షంతో బాదేపల్లి మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా తాడ్పాలుతో కప్పారు. అడ్డాకుల మండలకేంద్రంలో గాలి ప్రభావంతో సర్వీస్ రోడ్డుపై చెట్లు కూలిపడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హన్వాడ మండలం టంకర గ్రామంలో ఈదురు గాలులకు చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చేతికొచ్చిన పంట తడిసిపోయింది. రాజాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి మామిడి రైతులతో పాటు కోతకు వచ్చిన వరి పంట దెబ్బతిన్నాయి. బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఇంటి పై కప్పు కొట్టుకుపోయింది.

పంటలను పరిశీలించిన అధికారులు

మిడ్జిల్ : మండలంలోని అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల గ్రామాల్లో సోమవారం వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఏవో సిద్ధార్థ పరిశీలించారు. ఆయా గ్రామాల్లో 412 మంది రైతులకు గాను 300 ఎకరాల్లో వరి, 8 మంది రైతులకు చెందిన 8 ఎకరాల మొక్కజొన్న, 8 ఎకరాల్లో మామిడితోట దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

రిజిస్టరైన సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఎంపికైన ముదిరాజులకు ఉత్తర్వులు అందజేస్తున్న పెద్ద విజయ్‌కుమార్

పాలమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చట్టపరంగా రిజిస్టరైన సంఘాలకే అధికార పార్టీ, అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని ముది రాజు మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన ముదిరాజు మహాసభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొందరు స్వార్థపరులు తమ స్వార్థం కోసం ముదిరాజు సంఘాలను వాడుకుని అబాసుపాలు చేస్తున్నారని, అలాంటి వారిపై సంఘం ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మెట్టుకాడి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా టి.రాములు, జి.రవి, కె.బాలసాయన్న, పి.శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారి టి.లక్ష్మీనారాయణ, ఎన్.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా జి.రాకమయ్య. పి.బుచ్చన్న, ఆర్.నరేందర్, జి.రాములు, కె.కృష్ణయ్య, పి.శ్రీహరి, జి.నాగరాజు, రాజశేఖర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సమగ్ర సమాచారంతో రావాలి



మాట్లాడుతున్న డీపీవో పార్థసారథి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 16 మండలాల ఎంపీవోలు సమగ్ర సమాచారంతో ఈనెల 17న జరిగే మంత్రి సమీక్షా సమావేశానికి, నేడు నిర్వహించే దిశ మీటింగ్‌కు హాజరుకావాలని డీపీవో పార్థసారథి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అన్ని మండలాల ఎంపీఈవోలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడిపై ప్రధానంగా చర్చ ఉంటుందని, మీ మండలాల్లో ప్రస్తుతం తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామాలు, తండాల వివరాలు సమగ్రంగా సమర్పించాలన్నారు. మేలో ఎండలు తీవ్రతరం కానుండటంతో ఏయే గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నాయనే వాటి వివరాలు కూడా సమర్పించాలన్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో జిల్లాలో 171 గ్రామాల్లో జీపీల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వీలైతే మరిన్ని గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బాలానగర్ మండలంలో చాలా గ్రామాల్లో నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ గ్రామ పంచాయతీల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీవోకు సూచించారు. ఇంటి పన్నులు నేటికి 97 శాతం వసూలు చేశారని, మిగిలిన 3శాతం కూడా వసూలు చేయాలన్నారు.

ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు

జిల్లా పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించగా, వారిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ముగ్గురికి పదోన్నతులు లభించాయి. భవ్యశ్రీకి నాగర్‌కర్నూల్ డీపీవో కార్యాలయానికి పదోన్నతిపై వెళ్తుండగా, రాజేష్ నారాయణపేట డీపీవో కార్యాలయానికి, శ్రీను వనపర్తి డీపీవో కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ అయ్యారు.

నేటి నుంచి ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో బుధవారం నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్, వీఆర్ఏ, వీఆర్వో, టెట్, డీఎస్సీ ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్ ప్రారంభం అవుతుంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఫాకల్టీ నియోజకవర్గానికి చెందిన నిరుపేద నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు. నగరంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ జరుగుతుంది. ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా వెయ్యి మందికి మొదటి విడతలో కోచింగ్ ఇచ్చే అవకాశం ఉంది. అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తామని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో పిలుపునిచ్చారు.

జిల్లాను ముందు వరుసలో నిలపాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మహిళా శక్తి, బ్యాంక్ లింకేజీ, ఉపాధి హామీ కార్యక్రమాల్లో జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో నిలపాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, డీపీఎం, ఏపీఎంలతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఎల్ఆర్ఎస్ తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఉపాధి హామీ కింద గరిష్ఠ వేతన రేటు రూ.307 పెంచినందున జాబ్‌కార్డు కూలీలు గరిష్ఠ వేతనం పొందేలా కొలతలు వేసి పనులు నిర్వహించాలన్నారు. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తుల గడువు ముగిసినందున దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 20 లోగా పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 18 నుంచి 21 వరకు ఇందిరమ్మ కమిటీలు, అర్హుల జాబితాను పరిశీలించాలన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

భూత్పూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన రోగులు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్ అందించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమ్మన్నగౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రఘు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న పూజారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత ఆర్టీవో కార్యాలయ సమీపంలోని గణేష్‌నగర్ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయిబాబా సుప్రభాత సేవ, కాగడ హారతులతో పాటు విఘ్నేశ్వర పూజ, ఆలయ వాస్తుపూజ, శుద్ధికోసం పుణ్యవచనము, అఖండ దీపారాధాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయి వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం సంధ్యహారతి నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పద్మజా గోపాల్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

మూసాపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ పౌరుడు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని చక్రపూర్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

పాఠశాలలో వైద్య శిబిరం

హన్వాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చిన్న దర్పల్లిలో ఆరు రోజులుగా ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల యూనిట్ 4 విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగిస్తున్నారు. మంగళవారం పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందజేశారు. డాక్టర్ మేఘన, ఇమ్మానియేల్, అశోక్ పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

నవాబ్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, భూ భారతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసిల్దార్ శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ కిరణ్‌కుమార్ సకాలంలో రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించాలి



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

మిడ్జిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి మిడ్జిల్ నుంచి వెలుగొమ్ముల గ్రామానికి వెళ్లే దారిలో, అయ్యవారిపల్లి నుంచి మున్ననూర్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా చెట్లు పడటంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం అధికారులకు తెలిసిన చెట్లను తొలగించడం లేదన్నారు. దీంతో నిత్యం మండల కేంద్రానికి వెళ్లే వారు చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తూకం ఖర్చు తగ్గించాలి

జడ్చర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన ధాన్యం క్వింటాలుకు రూ.45 ఖర్చు వస్తుందని, దాన్ని తగ్గించాలంటూ బీజేపీ నాయకులు మంగళవారం మార్కెట్ కార్యదర్శి నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కెట్‌కు రైతు తెచ్చిన ధాన్యం ట్రాక్టర్‌లో నుంచి అన్‌లోడ్ చేయడం, సరుకును కుప్పపోయడం, ఖరీదుదారుడి బస్తాలోకి నింపడం, తూకం చేయడం, దడవయి చార్జీతో పాటు కమీషన్ ఏజెంటు తీసుకునే కమీషన్‌తో కలిపి క్వింటాలుకు రూ.45కు పైగా ఖర్చు వస్తుందని వివరించారు. అలాగే రెండు సంవత్సరాలకు ఒక పర్యాయం హమాలీ రేటును పెంచేస్తున్నారని, ఇది సరైంది కాదని వినతిలో పేర్కొన్నారు. మార్కెట్‌లో దడవయిల మాదిరిగా హమాలీలను సైతం జంబ్లింగ్ పద్ధతిలో మార్చాలని కోరారు. రైతులకు వెచ్చిస్తున్న ఖర్చును తగ్గిస్తారా? లేదా ప్రభుత్వమే భరిస్తుందా? అనే విషయాన్ని 15 రోజుల్లోగా తేల్చాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా అధికారప్రతినిధి నవీన్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీనియర్ సిటిజన్ ఫోరం సేవలు ఆదర్శం



ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు మజ్జిగ అందజేస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు చేస్తున్న సామాజిక సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ కూడళ్లలో ఎండలో డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు సీనియర్ సిటిజన్ ఫోరం తరుపున మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ వేసవి ముగిసే వరకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ఫోరం తరఫున ప్రతీ రోజు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, బాలయ్య, లక్ష్మణ్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, మనోహర్‌రావు, సుభాష్ ఆర్య, అహమ్మద్, రాజసింహుడు, బుచ్చన్న, రాములు, నాగభూషణం పాల్గొన్నారు.